క్లుప్తంగా

వాలంటైన్స్ డేను బహిష్కరించండి

జనగామ: మన సంస్కృతీ సంప్రదాయాలకు విరుద్ధమైన 'వాలంటైన్స్ డే'ను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని హిందూ సంప్రదాయ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు పిట్టల సత్యం అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీన వీర జవాన్ల దినోత్సవం పురస్కరించుకుని పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లను స్మరించుకోవాలన్నారు. పట్టణ, శివారు ప్రాంతాల్లో జంటగా తిరుగుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇస్తామని, అవసరమైతే పోలీసు సహకారం తీసుకుంటామని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన నాయీబ్రాహ్మణులు



జనగామ రూరల్: కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యను నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ జిల్లా నాయకులు బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. జిల్లాలోని నాయీబ్రాహ్మణ సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లెల గణేష్, కొత్తపల్లి అభినాష్, జంపాల వెంకన్న, స్రవంతి ఉన్నారు.

పైపులు వద్దు.. బ్రిడ్జి నిర్మించండి

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి–ఇప్పగూడెం రహదారిలోని గంగదేవమ్మ గుడి సమీపంలోని సీతోనివర్రెపై కాంట్రాక్టర్ పైపులు వేసే పనులు చేపట్టగా స్థానిక రైతులు అడ్డగించి పైపులు వద్దు..బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. గురువారం పీఆర్ డీఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్‌తో చేరుకోగా భారీ వర్షాల సమయంలో పోచమ్మ చెరువు అలుగు ఉధృతితో బ్రిడ్జి లేకపోవడంతో బావుల వద్దకు వెళ్లలేక పోతున్నామని పైపులు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డీఈతో రైతులు స్వల్ప వాగ్వాదం చేశారు. ఈశ్వరయ్య, రాజేందర్, కొమురయ్య, చంద్రయ్య ఉన్నారు.

రేవంత్‌రెడ్డిపై విమర్శలు తగదు

స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శిస్తూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొలిపాక సతీష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిని విమర్శిస్తూ మంత్రి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుండగా బీఆర్‌ఎస్ నేతలు, మంత్రి దయాకర్‌రావు ఆందోళన చెందుతున్నారన్నారు. మరోసారి వ్యాఖ్యలు పునరావృతం అయితే సహించేది లేదన్నారు. చల్లా తిరుపతి, మధు, శ్రీనివాస్, అరుణ్, రాజేష్‌రెడ్డి, శివ, వంశీ పాల్గొన్నారు.

'స్కూల్ బ్యాంక్' బాగుంది



చిల్పూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా నిర్వహిస్తున్న స్కూల్ బ్యాంక్ ఆఫ్ చిల్పూరు బాగుంది.. ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని నాబార్డు ప్రాజెక్టు మేనేజర్ వెంకట్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలను గురువారం చిల్పూరుగుట్ట రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులు నిర్వహిస్తున్న బ్యాంక్ పనులు.. విధానం గురించి తెలుసుకున్నారు. త్వరలో సహకారం అందిస్తామని చెప్పారు. హెచ్ఎం లీల, దాసి శ్రవణ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ శైలజ, పిట్టల సంపత్, దామెర విజయ్, భువనగిరి స్వామి, కలకోల రంజిత్, అవుల రాజు పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన చట్ల కుమారస్వామిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సర్వాగౌడ్ హైదరాబాద్‌లో గురువారం నియామకపత్రాన్ని అందజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఎంఈఐ గంట రవీందర్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. నోడల్ ఆఫీసర్ కేజీయాగ్రేస్‌రాణి, ఉపాధ్యాయులు వెంకటాద్రి, చంద్రమౌళి, కిష్టయ్య, రాజనారాయణ, వెంకన్న, రాజేందర్, మానక, రాజు, మొయినొద్దీన్, వెంకటలక్ష్మి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యేనా?

- స్టేషన్‌ఘన్‌పూర్‌కు అర్హత ఉన్నా అమలుకు నోచుకుని వైనం
- ఏళ్ల తరబడి ఎదురుచూపులు



స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లాలో జిల్లా కేంద్రం తర్వాత పెద్ద సెంటర్‌గా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఏళ్ల తరబడి మున్సిపాలిటీ అయ్యే మోక్షం లభించడం లేదు. నియోజకవర్గ కేంద్రం, డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌కు నిబంధనల మేరకు అన్ని అర్హతలు ఉన్నా మున్సిపాలిటీ అయ్యే భాగ్యం కలగడం లేదు. పాలకులు ఇదిగో, అదిగో అంటూ ఆశలు చూపుతుండగా ప్రజలకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. మున్సిపాలిటీ విషయంలో మొదటి నుంచి పాలకులు, ప్రజాప్రతినిధులు ఘన్‌పూర్‌పై శీతకన్ను వేస్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతో..

2011 జనాభా లెక్కల ప్రకారం మేజర్ గ్రామ పంచాయతీ అయిన స్టేషన్‌ఘన్‌పూర్ జనాభా 12వేల పైచిలుకు ఉంది. ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లి జనాభా ఆరువేలకు పైగా ఉంది. మున్సిపాలిటీ కావాలంటే నిబంధనల మేరకు 15వేల జనాభా ఉండాలి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఘన్‌పూర్ మున్సిపాలిటీ అవుతుందని విస్తృత ప్రచారం జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం తప్పనిసరిగా అవుతుందని, జంట పట్టణాలైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే ఘన్‌పూర్‌పై పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో మున్సిపాలిటీ ఆశ అడియాస అయ్యింది.

ఎదురు చూస్తున్న ప్రజలు..

ఘన్‌పూర్ కన్నా చిన్న సెంటర్, 2011 లెక్కల ప్రకారం కేవలం 8వేల పైచిలుకు జనాభా ఉన్న వర్ధన్నపేటను మున్సిపాలిటీ చేశారు. దాంతో ఘన్‌పూర్ గ్రామ పంచాయతీగానే ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ జనాభా దాదాపు 16వేలకు పైగా ఉండటం వచ్చే ఎన్నికలకు ముందు స్టేషన్‌ఘన్‌పూర్ తప్పనిసరిగా మున్సిపాలిటీ అయ్యే అవకాశం ఉంది. శివునిపల్లి జనాభా 10వేల వరకు ఉంది. పలుమార్లు సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేయడం ఖాయమని చెబుతుండగా ఈ సారి మున్సిపాలిటీగా మారే అవకాశాలు బలంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీ చేస్తారని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తప్పక మున్సిపాలిటీ అవుతుంది..



ఈసారి తప్పనిసరిగా స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ అవుతుంది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రత్యేక చొరవతో కృషి చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందే కావాల్సి ఉంది. అనివార్య కారణాలతో కాలేదు. మున్సిపాలిటీ కావడానికి ఉండాల్సిన జనాభాతో పాటు నిబంధనల మేరకు ఘన్‌పూర్‌కు అన్ని అర్హతలు ఉన్నాయి.

- తాటికొండ సురేష్‌కుమార్, సర్పంచ్, స్టేషన్‌ఘన్‌పూర్

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జనగామ: పట్టణంలోని చెన్నకేశవ ఆలయంలో లోక కల్యాణార్థం శ్రీ భూనీళా సమేత శ్రీవారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. అధ్యయనోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీభాష్యం నర్సింహాచార్యులు, శ్రీభాష్యం వెంకటరమణాచార్యులు, వేదపండితుల ఆధ్వర్యాన కల్యాణం కడురమణీయంగా జరిపించారు. ఈ నెల 8వ తేదీ రాత్రి శ్రీవారి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ సమయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మాల మార్పిడి, హెచ్చరికలు దివ్యంగా నిర్వహించారు. శ్రీవారి లగ్నం కళ్లారా చూసేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం మహిళా భక్తులు అమ్మవారిక ఒడిబియ్యం పోసి, కట్న కానుకలను సమర్పించారు.



ధ్వజస్తంభం

కలియుగ భగీరథుడు సీఎం కేసీఆర్

- అసెంబ్లీలో మాట్లాడిన జనగామ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: ఇంజనీరింగ్ వ్యవస్థకు చీఫ్‌గా మారిన సీఎం కేసీఆర్.. నదుల రీడిజైన్‌తో పారే నీటిని మళ్లిస్తూ.. బీడు భూములను పచ్చగా మారుస్తూ కలియుగ భగీరథుడిగా మారాడని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. తెలంగాణలో నిర్మితమైన ప్రాజెక్టుల రూపకల్పనపై ప్రపంచ దేశాలు సైతం అధ్యయనం చేయడం గర్వకారణమన్నారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని, దీనిపై బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ధరణితో ప్రక్షాళన చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. గతంలో భూములకు సంబంధించిన సమస్య ఏళ్ల తరబడి నడిచేదని, భూములు కొనుగోలు చేసిన తర్వాత మ్యుటేషన్ చేసే సమయంలో వారసులు, ఇతర కుటుంబ సభ్యుల సంతకాలు అవసరమైనప్పుడు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ధరణి వచ్చిన తర్వాత అర్బన్ పరిధిలోని చాలా మంది పల్లె ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తుండడంతో డబ్బుల రొటేషన్ పెరిగిందని వివరించారు.

'అక్షర సంచారం' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జనగామ: కవి జంగ వీరయ్య రచించిన 'అక్షర సంచారం' కవితా సంపుటిని ఈనెల 12న జిల్లా కేంద్రంలో ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా తెలంగాణ రచయితల సంఘం(తెరసం) ఆధ్వర్యంలో గురువారం స్థానిక పుల్లయ్య కళానిలయంలో ఆవిష్కరించారు. అనంతరం తెరసం జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి మాట్లాడుతూ వైఎస్ఎస్ఆర్ లయన్స్ భవన్‌లో జరిగే సంపుటి ఆవిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, లింగంపల్లి రామచంద్ర, పోరెడ్డి రంగయ్య, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, డాక్టర్ తైదల అంజయ్య, డాక్టర్ సిద్దెంకి యాదగిరి, డాక్టర్ పొన్నాల బాలయ్య, బిల్లా మహేందర్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగ వీరయ్య, కవులు, కళాకారులు, జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, మసురం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూర్: మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి శాఖ పరమైన తోడ్పాటు అందించడంతో పాటు గ్రామాలకు సాగు నీరు, చిల్పూరుగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందిచినట్లు తెలిపారు. చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి,, బాలరాజు, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ రంగురమేష్ ఉన్నారు.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాల్సిందే



మాట్లాడుతున్న రమేష్

చిల్పూరు: ప్రభుత్వం పాతపద్ధతిలోనే గొర్రెలను పంపిణీ చేస్తామంటే ఊరుకునేది లేదని, అర్హులైన వారందరికీ నగదు బదిలీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని గంగాదేవి ఆలయ ప్రాంగణంలో గురువారం సంఘం మండల అధ్యక్షుడు బోల్ల రాజ్‌కుమార్ అధ్యక్షతన మండల మూడో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల సమయంలో గొల్లకురుమలందరికి నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి, ఎన్నికలు పూర్తి అయ్యాక పాత పద్ధతిలోనే గొర్రెలను పంపిణీ చేస్తామంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రభాకర్, అపరాదపు రాజు, ఆసరి రాజయ్య, దోకి శ్రీనివాస్, గాలి ప్రవీణ్, లొడెం అశోక్, దాసరి కుమార్, గాద్దుల రాజయ్య, రమేష్, రాజయ్య, కుమార్, కోటిలింగం, వెంకట్రాజం, రాజకొంరయ్య పాల్గొన్నారు.

కంటివెలుగు ప్రారంభం

కొడకండ్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా.. వారి కంటి సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని సర్పంచ్ జాజుల శ్రీలేఖ అన్నారు. గురువారం పాకాలలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొకొవాలన్నారు. ఉపసర్పంచ్ సుధీర్‌రెడ్డి, నారాయణరెడ్డి, డాక్టర్ ర జనీకాంత్ పాల్గొన్నారు.

మారుమూల పల్లెలకు కంటివెలుగులు

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మారుమూల పల్లె ప్రజలకు సైతం కంటి వెలుగులు లభిస్తున్నాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివారు ప్రాంతమైన దాదాసాహెబ్‌కాలనీలో ప్రత్యేక కంటివెలుగు శిబిరం నిర్వహించి అవసరార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్‌టీయూ కృషి



50 ఏళ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించి, సత్కరిస్తున్న నాయకులు

జనగామ: ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్ల మహిపాల్‌రెడ్డి, నూకల ఎల్లారెడ్డి అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నాయకులు దివంగత సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెండా ఆవిష్కరించిన అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధ్యాయులకు అందుతున్న సౌకర్యాలు పీఆర్‌టీయూ కృషి ఫలితమే అన్నారు. మంత్రి హరీష్‌రావు ఉద్యోగుల కోసం కొత్తగా ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం 50 ఏళ్ల క్యాలెండర్ ఆవిష్కరించి.. మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యుతోపాటు విశ్రాంత ఉపాధ్యాయులు నల్లారి విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, నర్సింగరావు, విద్యాసాగర్, దాసరం బాలయ్య, నర్సింహారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, యాదగిరి, కేశవరావు, అంజిరెడ్డి, పుల్లారెడ్డి, రమేష్, సోమరాజు, నర్సిహ్మారెడ్డి, గణేష్, సత్తయ్య పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి ఊరకుంట వద్ద వ్యర్థాలను తొలగించాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. శివునిపల్లి ఊరకుంటలో వ్యర్థాలు, చెడుపదార్థాలను పోస్తుండగా చేపలు మృత్యువాత పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన గురువారం కుంటను సందర్శించారు. గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డులో పోయాల్సిన వ్యర్థాలను ఊరకుంటలో పోయడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ తక్షణమే స్పందించాల అన్నారు. భిక్షపతి, రమేష్, కొండ వేణు, కుంభం ఉపేందర్, చెన్నూరి వేణు, రాజు ఉన్నారు.

ఆరె కుల ఆత్మగౌరవానికి పాటుపడాలి

దేవరుప్పుల: ఆరె కుల ఆత్మగౌరవం కోసం అందరూ పాటుపడాలని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సింధె రామనర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 15వ తేదీన ఉప్పల్ భగాయత్ మెట్రోస్టేషన్ తూర్పు వైపు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తలపెట్టిన ఆరె కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగోజీ, సోమనర్సోజీ తదితరులు ఉన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



జీపీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి జీపీ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పల్లె ప్రగతి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించాలని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

బచ్చన్నపేట: అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి పుట్టగూడెం గ్రామానికి ఆటోలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వెళ్లి పట్టుకొని ఆటో, తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. బియ్యం తీసుకెళ్తున్న పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్య జాలం, భూక్య భద్రులను కూడా పట్టుకున్నామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి హఠాన్మరణం



వేణుగోపాల్ (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు దుబ్బాక వేణుగోపాల్ (52) గురువారం ఉదయం గుండె పోటుతో హఠాన్మరణం చెందాడు. కాజీపేట దర్గా పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వేణుగోపాల్ అక్కడే ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం బాత్‌రూంలోకి వెళ్లి అందులోనే గుండె పోటుతో మరణించాడు. బాత్‌రూంలో నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగులకొట్టి చూడగా మరణించి ఉండటంతో గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించగా గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



దేవరుప్పుల: విజేతలకు బహుమతులు అందిస్తున్న చంద్రశేఖర్ ఆర్యా తదితరులు



బచ్చన్నపేట: విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

దేవరుప్పుల: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటేనే సృజనాత్మకత వెల్లడవుతుందని క్విజ్‌పోటీలు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. చంద్రశేఖర్ ఆర్యా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ ప్రశాంతి విద్యానికేతన్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో మార్గం ప్రేమలత ప్రభాకర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలైన బి.కృతిక, దీపిక, శ్రీతేజ, మనీషా, హాసినీ, అక్షయ్‌లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భయ్యా సాంబమూర్తి, లయన్ మార్గం ప్రభాకర్, సీనియర్ పాత్రికేయులు ఉప్పల రమేష్ శర్మ, కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గడ్డం సత్యనారాయణ రెడ్డి, రామచంద్రారెడ్డి, కోశాధికారి గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి, కన్వీనర్ పట్టాభిరామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్..

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్ఎస్‌సీ ట్యాలెంట్ టెస్ట్‌లో పాఠశాల విద్యార్థిని బూసరాజు ప్రేమ ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా, ఫౌండేషన్ వారు ప్రోత్సాహకంగా రూ.6 వేల విలువైన సైకిల్‌ను పంపించంగా ప్రిన్సిపాల్ అందజేశారు. అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించిన ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

జనగామ రూరల్: పట్టణంలోని నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ చుంచు విజేందర్ అన్నారు. గురువారం సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో పేదలు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ సొంత ఇల్లు లేక, పనులు దొరకక, అద్దెలు చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐద్వా అధ్యక్షురాలు అహల్య, గౌసియ, రజిత, జ్యోతి, ఉషారాణి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

చిల్పూర్: నియోజకవర్గంలో మంత్రిగా, ఎమ్మెల్సీగా కడియం శ్రీహరి చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలిపేందుకే క్యాలెండర్ల ఆవిష్కరణ అని కడియం యువసేన గ్రామ శాఖ అధ్యక్షుడు కన్నెబోయిన మల్లేషం అన్నారు. మండలంలోని పల్లగుట్టలో గురువారం కడియం యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ పేరాల సుధాకర్ ఆవిష్కరించారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ రడపాక సుదర్శన్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబుతో కలిసి ఎంపీపీ గురువారం ప్రారంభించారు.

సామాజికంగా ఎదగాలి

బచ్చన్నపేట: ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్‌ని శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ప్రకటించడంతో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి పాలనను అంతమొందించాలి

బచ్చన్నపేట: రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనను అంతమొందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పలు సమస్యలను చర్చించుకోవడానికి నేటి (శుక్రవారం) నుంచి ప్రజా గోస -బీజేపీ భరోసా పేరుతో అన్ని మండలాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పోచన్నపేటలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జనగామ రూరల్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. గురువారం మండలంలోని శామీర్‌పేటలో సర్పంచ్ స్వరూప ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్ఐ రాకేష్ శివరాత్రి స్వప్న రాజు, సంపత్, వినయ్, నాగభూషనం, మేకల రామకృష్ణ, చాట్ల దానియల్ పాల్గొన్నారు. అలాగే పెంబర్తిలో గురువారం సర్పంచ్ అంబాల ఆంజనేయులు ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

భాషాపండితుల నిరసన

జఫర్‌గఢ్: భాషాపండితుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ములుకనూరి శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. జేఏసీ నాయకులు చక్రవర్తుల శ్రీనివాస్, ములుకనూరి శంకర్ పాల్గొన్నారు.

పాడితో జీవనోపాధి పొందాలి

బచ్చన్నపేట: అన్నదాతలు వ్యవసాయంతో పాటు పాడిని ఎంచుకుని జీవనోపాధి పొందాలని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్ అన్నారు. స్థానిక బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ చైర్మన్‌గా పుర్మ జోగిరెడ్డిని గురువారం ఎన్నుకోగా.. కమిటీ సభ్యులను సత్కరించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాడితో 15 రోజులకు ఒకసారి వచ్చే ఆదాయం చేదోడు వాదోడుగా ఉంటుందని, పాడి గేదెల కొనుగోలుకు డెయిరీ నుంచి రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజపేట, మద్దూరు, బచ్చన్నపేట మండలాల పరిధి 44 సొసైటీల గ్రామ అధ్యక్షులు కలిసి ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఇక నుంచి యూనిట్ నిర్వాహణను కమిటీ సభ్యులే చూసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి భాస్కర్‌రెడ్డి, పరిదె సత్తయ్య, ఎడబోయిన రవీందర్‌రెడ్డి, ముచ్చనపల్లి మల్లేశం, గడిపె ఎల్లయ్య, పల్లపు రామకృష్ణ, పిట్టల శ్రీనివాస్, ఎలికట్టి శ్రీనివాస్‌ను నూతన డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. మేనేజర్ శివప్రసాద్, రూట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, టెస్టర్లు అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జోగిరెడ్డిని సన్మానిస్తున్న సోమిరెడ్డి